విచారణ అనంతరం ఏసీబీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

నందినగర్‌లోని స్వగృహంలో కేటీఆర్‌కు స్వీట్ తినిపిస్తున్న సతీమణి శైలిమ. చిత్రంలో మంగళహారతి ఇస్తున్న కవిత

తప్పుచేయలేదు.. తలవంచేది లేదు

మొదటిపేజీ తరువాయి...

తరలివచ్చిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'ఏసీబీ అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్పినం..మళ్లీ ఎన్నిసార్లు పిలిచినా వెళ్లేందుకు సిద్ధం' అని చెప్పారు. 'గతంలో ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్లొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పైశాచికానందం కోసమే నన్ను జైలుకు పంపేందుకు కుట్రలు చేస్తున్నరు. ఆయన బెదిరింపులకు కేసీఆర్ సైనికులెవరూ భయపడబోరు' అని స్పష్టంచేశారు. తాను హైదరాబాద్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, తెలంగాణను ఎలిక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రంగా మార్చేందుకే ఫార్ములా ఈ- కారు రేస్‌ను ఇక్కడికి తెచ్చానని వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలపటానికి నాడు రాష్ట్ర మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశామని, ఆ ప్రయత్నాలు చాలా వరకు ఫలించి హైదరాబాద్ దేశంలోనే గొప్పనగరంగా, ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదిగిందని గుర్తుచేశారు.

రేవంత్ రాసిచ్చిన ప్రశ్నలే..

సీఎం డైరెక్షన్‌లోనే ఏసీబీ ఈ కేసు విచారణ చేపట్టిందని, రేవంత్ రాసిచ్చిన నాలుగైదు ప్రశ్నలనే అధికారులు అటు తిప్పి ఇటు తిప్పి అడిగారు తప్ప ఏమీ లేదని కేటీఆర్ తెలిపారు. మంత్రిగానే ఫార్ములా సంస్థకు నగదు చెల్లింపు నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. 'రేవంత్‌రెడ్డి సీఎంగా మూర్ఖపు వ్యవహారాలు చేస్తున్నాడు. ఇచ్చిన హామీలు మరిచి కేసులు, కక్ష సాధింపుతో పాలన సాగిస్తున్నాడు' అని ధ్వజమెత్తారు.

నీ ప్యాలెస్‌కు రమ్మంటే వస్తా!

'రేవంత్..నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు రమ్మంటే వస్తా.. ఈ రేసుపై ఎక్కడైనా చర్చకు సిద్ధమే.. ఇద్దరం లై డిటెక్టర్ పరీక్ష చేసుకుందాం' అని కేటీఆర్ సవాల్ చేశారు. 'ఏసీబీ అడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్పిన. ఇంకా ఎన్నిసార్లు పిలిస్తే అన్నిసార్లు వస్తానని కూడా వారికి స్పష్టంగా చెప్పిన. ఏసీబీ కేసులో ఏమీలేదనే విషయం కేసు పెట్టినవారికి కూడా తెలుసు. ఏం చేయాలో? ఏం అడగాలో వారికే తెలియటం లేదు. అధికారులకు ఏం చేయాలో తోచటం లేదు. వారూ ఒత్తిడిలో ఉన్నారు' అని వివరించారు. 'దొంగతనం గురించి రేవంత్‌రెడ్డికి తెలిసినంత మరెవ్వరికీ తెలియదు. ఎలాగైనా మమ్మల్ని జైల్లో పెట్టాలన్నదే రేవంత్ దురాలోచన' అని నిప్పులు చెరిగారు.

ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్‌ను భుజాల మీద ఎత్తుకొని తెలంగాణభవన్ లోపలికి తీసుకొస్తున్న బీఆర్ఎస్ నేతలు

ప్రశ్నించటం ఆపను

ఏడాదిగా కాంగ్రెస్‌ను, రేవంత్‌రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నది బీఆర్ఎస్సేనని కేటీఆర్ చెప్పారు. 'విద్యుత్ చార్జీలు పెంచొద్దని కొట్లాడింది బీఆర్ఎస్.. లగచర్ల రైతులను జైళ్లలో పెడితే కొట్లాడింది బీఆర్ఎస్.. హైడ్రాపేరుతో పేదల ఇండ్లను కూలగొడితే అడ్డుకున్నది బీఆర్ఎస్.. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే అడుగడుగునా నిలదీస్తున్నది బీఆర్ఎస్.. నన్ను జైలులో పెట్టడం ద్వారా మా పార్టీ కేడర్‌ను, నాయకత్వాన్ని దారిమళ్లింపు, దృష్టిమళ్లింపు చేస్తానని అనుకుంటున్నవ్ రేవంత్‌రెడ్డీ.. అది నీ వల్ల కాదు. ఇంకో వంద పెట్టుకో.. వెయ్యి పెట్టుకో.. మాకు న్యాయస్థానాల మీద, న్యాయ వ్యవస్థ మీద సంపూర్ణమైన విశ్వాసం ఉన్నది. ఏ ప్రశ్నలు అడిగినా సమాధానం చెప్తం. నిజాయితీగా ఉన్నం. నీలా తుచ్ఛపు పనులు చేయలేదు.. చేయబోము' అని స్పష్టంచేశారు.

తెలంగాణ జయించేదాకా పోరాటం ఆగదు

కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణ జయించి బయటకొచ్చేదాకా కొట్లాడుతూనే ఉంటానని కేటీఆర్ స్పష్టం చేశారు. 'నేనేమీ ఎమ్మెల్యేలను కొనేందుకు రూ.50 లక్షలతో దొరికిన దొంగను కాదు.. మా మీద ఎన్ని కేసులు పెట్టినా ఆరు గ్యారెంటీలను, వాటిలో అంతర్భాగమైన 420 హామీలను అమలు చేసే దాకా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటాం' అని తేల్చిచెప్పారు. తమకు న్యాయ వ్యవస్థ మీద.. న్యాయస్థానాల మీద విశ్వాసం ఉన్నదని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందని, తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని పునరుద్ఘాటించారు.

నా కొడుకు కంపెనీకి కాంట్రాక్ట్‌లు ఇచ్చుకోలే

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ఆశ్రిత పక్షపాతానికి తావివ్వలేదని కేటీఆర్ స్పష్టంచేశారు. 'మా బావమరుదులకు రూ.1137 కోట్ల కాంట్రాక్టులు చేయలేదు. మంత్రిగా నేను కౌన్సిల్‌లో కూర్చొని నా కొడుకు కంపెనీకి కాంట్రాక్ట్‌లు ఇచ్చుకోలేదు. నేను ల్యాండ్ క్రూజర్ కార్లు కొనుక్కోలేదు' అని ఎద్దేవాచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులకు ఉన్న చావు తెలివితేటలు తమకు లేవని దెప్పిపొడిచారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారం కొంతమందికి అర్థమై, అర్థంకాక మీడియా మేనేజ్‌మెంట్ ద్వారా రాజకీయ పబ్బంగడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని, ఏం చేసినా చెల్లుతుందనుకునే కాంగ్రెస్ నాయకులకు నిజం నిలకడ మీద తెలుస్తుందని చెప్పారు.

కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు

కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కార్యకర్తలు, నాయకులు, ముఖ్యంగా సిరిసిల్ల నుంచి వచ్చిన వారికి కేటీఆర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణభవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, గొంగిడి సునీత, సుంకె రవిశంకర్, నాయకులు దూదిమెట్ల బాలరాజుయాదవ్, కిషోర్‌గౌడ్, కురువ విజయ్‌కుమార్, గెల్లు శ్రీనివాస్, ఏనుగు రాకేశ్‌రెడ్డి, తుంగ బాలు, మహిళా నాయకులు తుల ఉమ, సుమిత్రా ఆనంద్, సుశీలారెడ్డి, మంత్రి శ్రీదేవి, రజితారెడ్డి, కిర్తీలత, పావనీగౌడ్, మంజులావాణి పాల్గొన్నారు.

భుజాలపై ఎత్తుకొని భవన్‌లోకి..

ఏసీబీ విచారణకు హాజరై తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేటీఆర్‌కు గులాబీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. రాష్ట్ర నలుమూలల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ద్వారం వద్ద మహిళా నాయకులు హారతి ఇచ్చి, దిష్టితీసి, కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు 'జై తెలంగాణ..జై కేసీఆర్..జై కేటీఆర్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. భుజాలపై ఎత్తుకొని భవన్‌లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తరలివచ్చిన నాయకులకు కేటీఆర్ అభివాదం చేశారు. అనంతరం చాలామంది నాయకులు కేటీఆర్‌ను కలిశారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. తెలంగాణ భవన్ నుంచి నందినగర్‌లోని ఇంటికి చేరుకున్న తర్వాత ఇంట్లో సోదరి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హారతి ఇచ్చి ఆహ్వానించారు.

> “దొంగతనం గురించి రేవంత్‌రెడ్డికి తెలిసినంత మరెవ్వరికీ తెలియదు. నేను దొంగతనం చేసి జైల్లో ఉన్న.. వాళ్లు ఏ తప్పూ చేయకున్నా జైల్లో పెట్టాలె అన్నదే రేవంత్ ఆలోచనగా తేలిపోయింది. రేవంత్‌రెడ్డికి ఉన్నది పైశాచికానందమే.. ఇంతెందుకు రేవంత్‌రెడ్డీ.. నన్ను నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు రమ్మంటావా? వస్తా. ఇద్దరం లై డిటెక్టర్ పరీక్ష చేసుకుందాం. అప్పుడు తెలుతుంది.. దొంగవు నువ్వో..నేనో!
> -కేటీఆర్

> “ఫార్ములా ఈ రేస్‌లో ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే ఏసీబీ విచారణ చేపట్టింది. రేవంత్ రాసిచ్చిన నాలుగైదు ప్రశ్నలనే అధికారులు అటు తిప్పి ఇటు తిప్పి అడిగారు తప్ప వేరే లేదు. ప్రభుత్వం నుంచి వెళ్లిన డబ్బు ఫార్ములా ఈ సంస్థ వద్ద ఉన్నాయనే విషయం వారే చెప్పారు. అలాంటప్పుడు అక్రమాలకు తావెక్కడిది?
> -కేటీఆర్

> “పదేండ్లుగా అత్యంత నీతి, నిబద్ధతతో మంత్రిగా పనిచేసిన. ఫార్ములా ఈ రేస్‌లో రూపాయికాదు కదా.. అరపైసా కూడా అవినీతికి పాల్పడలేదు. కానీ ఇందులో ఏదో మతలబు ఉన్నదని ప్రభుత్వం ఒత్తిడి చేసి నాపై ఏసీబీతో చెత్తకేసు పెట్టించింది. ఇందులో విషం తప్ప విషయం లేదు.
> -కేటీఆర్

రేస్ రద్దుతోనే ప్రభుత్వానికి నష్టం

- రద్దుకు కారణమైన సీఎంను ఎందుకు కేసులో చేర్చలేదు?
- క్యాబినెట్ ఆమోదం లేకుండా రేస్‌ను సీఎం రద్దు చేయలేదా?
- హైదరాబాద్ ప్రతిష్టను పెంచేందుకే ఫార్ములా ఈ-కార్ రేస్
- రాష్ట్ర మంత్రిగా విధానపరమైన నిర్ణయానికి సంతకాలు చేశా
- ఇందులో పైసా అవినీతి జరగనప్పుడు అక్రమ కేసు ఎందుకు?
- ఏసీబీ విచారణాధికారులతో మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా ఈ-కార్ రేసును కొనసాగించకపోవడం వల్ల, ఒప్పందాలను ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదం లేకుండా రద్దు చేయడం వల్లనే ఆర్థిక నష్టం వాటిల్లిందని, ఒప్పందాన్ని రద్దుచేసి ప్రభుత్వానికి నష్టం కలిగించిన సీఎం రేవంత్‌రెడ్డిని ఈ కేసులో ఎందుకు భాగస్వామిగా చేర్చలేదని ఏసీబీ అధికారులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించినట్టు సమాచారం. ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఫార్ములా ఈ-కార్ రేస్‌ను నిర్వహించామని, దాని నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలకు మంత్రి హోదాలో సంతకాలు చేశానని ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చినట్టు సమాచారం. ఫార్ములా ఈ-కార్ రేస్‌కు సంబంధించి గురువారం ఉదయం ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. నలుగురు విచారణాధికారుల బృందం సుమారు 7 గంటల పాటు.. 82 ప్రశ్నలు అడిగింది. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు కేటీఆర్ ఓపిగ్గా సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. ఫైల్ మూమెంట్ పైన ఏసీబీ సంధించిన ప్రశ్నలకు 'ఫైల్ మూమెంట్‌కు చట్టపరంగా బాధ్యత వహించే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎందుకు నోటీసు ఇవ్వలేదు?' అని కేటీఆర్ ప్రశ్నించినట్టు సమాచారం. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారనే అంశం గురించి ఏసీబీ ప్రశ్నించినప్పుడు.. 'క్యాబినెట్ ఆమోదం లేకుండా రేసును రద్దు చేసిన సీఎంను బాధ్యుడిగా చేయాల్సి వస్తుంది. ఆ పని ఎందుకు చేయలేదు' అని కేటీఆర్ అడిగినట్టు తెలిసింది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్యమంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలని కేటీఆర్ కోరినట్టు సమాచారం. కొన్ని ప్రశ్నలనే తిప్పితిప్పి విచారణ బృందం అడిగినట్టు తెలిసింది.

పదే పదే అవే ప్రశ్నలు!

విచారణ అధికారులుగా ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రుతిరాజ్, అడిషనల్ ఎస్పీలు శివరాం శర్మ, నరేందర్‌రెడ్డి, కేసు విచారణాధికారి డీఎస్పీ మాజీద్ ఖాన్ కలిసి ఓ ప్రత్యేక గదిలో కేటీఆర్‌ను ప్రశ్నించారు. మధ్యాహ్నం లంచ్ బ్రేక్ ఇచ్చిన అధికారులు, మళ్లీ విచారణ కొనసాగించారు. విచారణకు కేటీఆర్ లాయర్, మాజీ ఏఏజీ రామచంద్రరావును ఏసీబీ అధికారులు లోనికి అనుమతించారు. సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఎన్ని ప్రశ్నలు అడిగినా సూటిగా సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. విచారణ అనంతరం తనను ప్రశ్నించిన అధికారులతో కాసేపు కేటీఆర్ మాట్లాడారు. ఇదే కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను గురువారం ఉదయం 11 నుంచి రాత్రి 7.20 గంటల వరకు ఈడీ అధికారులు ప్రశ్నించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. బుధవారం ఏసీబీకి ఇచ్చిన సమాధానాలే ఈడీకి కూడా చెప్పినట్టు సమాచారం.

కేటీఆర్‌ను ఏసీబీ అడిగిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు.. వాటికి ఆయన ఇచ్చిన సమాధానం..

ఏసీబీ : ఫార్ములా ఈ ఫైల్ పైన సంతకం పెట్టడం గురించి చెప్పండి? ఫైల్‌ను క్యాబినెట్ ఆమోదానికి ఎందుకు పంపలేదు?

కేటీఆర్ : రేసును హైదరాబాద్‌లో కొనసాగించాలని, తెలంగాణ ప్రతిష్టను మరింత పెంచాలన్న ఉద్దేశంతోనే ఫైలుపై సంతకం పెట్టాను. ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన బిజినెస్ రూల్స్ వ్యవహారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధీనంలో ఉంటుంది.

ఏసీబీ: ఫైల్ మూమెంట్ ఎలా జరిగింది?

కేటీఆర్ : ఫైల్ మూమెంట్‌కి చట్టపరంగా బాధ్యత వహించే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎందుకు నోటీసు ఇవ్వలేదు?

ఏసీబీ: నాడు రాష్ట్ర ప్రభుత్వం, మీరు తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన జీవో ఏమైనా ఇచ్చిందా?

కేటీఆర్: సచివాలయ బిజినెస్ రూల్స్ అన్నీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధిలో ఉంటాయి. ఈ అంశానికి సంబంధించి ప్రభుత్వాన్నీ అడగవచ్చు.

ఏసీబీ : ఫార్ములా ఈ-కార్ రేస్ నిర్వహణ వల్ల ప్రభుత్వానికి భారీగా నష్టమొచ్చింది

కేటీఆర్ : రేసు కొనసాగించకపోవడం వల్లనే ప్రభుత్వానికి ఆర్థిక నష్టం వాటిల్లింది. ఒప్పందం రద్దుచేసి ప్రభుత్వానికి నష్టం చేకూర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎందుకు ఈ కేసులో భాగస్వామిగా చేర్చలేదో చెప్పండి. ఫార్ములా ఈ-రేస్‌కు సంబంధించిన పూర్తి ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ కూడా రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు నాకు ప్రభుత్వం కేటాయించిన అధికారిక ఈమెయిల్లోనే ఉన్నాయి. ప్రస్తుతం ఆ అకౌంట్ కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్దనే ఉన్నది. మంత్రిగా విధానపరమైన నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వంలో భాగమైన నాకు ముమ్మాటికీ ఉన్నది.

ఏసీబీ : ఈ మొత్తం అంశంలో అవినీతి ఆరోపణలపై మీ సమాధానం ఏంటి?

కేటీఆర్ : ప్రభుత్వం పంపిన డబ్బులు మొత్తం ఫార్ములా-ఈ రేస్ కంపెనీకి చేరినప్పుడు అవినీతి అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు.

ఏసీబీ : డబ్బులు ఎక్కడి నుంచి ఎక్కడికి పోయాయి? ఎలా చేతులు మారాయి?

కేటీఆర్ : ఎక్కడ డబ్బులున్నాయి అన్న విషయంలో స్పష్టత ఎఫ్ఐఆర్‌లోనే ఉన్నది. అలాంటప్పుడు డబ్బులకు సంబంధించి దుర్వినియోగం ఎక్కడ జరిగింది? నాపై చేస్తున్న అవినీతి ఆరోపణల్లో పస లేదు.

ఏసీబీ : డబ్బుల కోసం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం ఎందుకు తీసుకోలేదు?

కేటీఆర్ : ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులే ప్రభుత్వ పనితీరు బిజినెస్ రూల్స్ గురించి చూసుకుంటారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాన్ని ప్రశ్నించే హక్కు ఏసీబీకి ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను నిర్వహించేందుకు అనేకసార్లు విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నాయి. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆఫ్రో ఏషియన్ గేమ్స్ వంటి క్రీడలను నిర్వహించింది. క్యాబినెట్ ఆమోదం గురించి ఇలా ప్రశ్నిస్తున్నారే.. మరి క్యాబినెట్ ఆమోదం లేకుండా రేసు రద్దు చేసిన ముఖ్యమంత్రిని కూడా ఈ కేసులో బాధ్యులను చేయాల్సి వస్తుంది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్యమంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలని నేను కోరుతున్నా.

ఏసీబీ: అర్బన్ ఏస్ సంస్థ మొదటిసారి రేసు నిర్వహించినప్పుడు పూర్తిగా డబ్బులు చెల్లించలేదు.. ఆ సంస్థ ఆర్థిక వ్యవహారాల గురించి మీకేమైనా తెలుసా?

కేటీఆర్ : మొదటి రేసు సందర్భంగా అర్బన్ ఏస్ సంస్థ పూర్తిగా ఫార్ములా ఈ తోనే కార్యకలాపాలు నిర్వహించింది. ప్రభుత్వ పరంగా కేవలం మౌలిక వసతులు మాత్రమే కల్పించే బాధ్యత తీసుకున్నాం. మొదటి రేస్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఫార్ములా ఈకి, అర్బన్ ఏస్ సంస్థకు మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలూ జరగలేదు. ఆ ప్రైవేట్ సంస్థ ఆర్థిక వివరాలు నాకు తెలియదు. ఆ అంశం నా పరిధిలోకి రాదు.

ఏసీబీ: రేస్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు, వాటి వివరాలు ఏంటి?

కేటీఆర్ : మొత్తం వ్యవహారానికి సంబంధించి నేను మంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన ఉత్తర ప్రత్యుత్తరాలు, తీసుకున్న నిర్ణయాలన్నీ ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించండి. ఇక రేసు ఏర్పాటు, దాని నిర్వహణ వల్ల ప్రభుత్వానికి భారీగా లాభం జరిగిందే తప్ప ఎలాంటి నష్టం జరగలేదు.

ఏసీబీ : చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డట్టు మీకు అనిపించడం లేదా?

కేటీఆర్ : ఈ మొత్తం ప్రక్రియలో చట్ట వ్యతిరేకమైన అంశం ఏదీలేదు. ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి లోటుపాట్లు ఉంటే ప్రభుత్వ పరమైన విచారణ చేస్తే సరిపోతుంది. ఎక్కడా పైసా అవినీతి లేనప్పుడు.. ఇందులో చట్టవ్యతిరేకత ఎక్కడుంది? మీరు ఎన్ని గంటలైనా సరే నన్ను ఈ కార్యాలయంలో కూర్చోమన్నా కూర్చుంటాను. ఒకవేళ మీకు ప్రభుత్వం నన్ను అరెస్టు చేయాలని ఆదేశాలిస్తే.. ఈ ప్రశ్నలు అడగడం అనే వృథా ప్రయాస మానేసి ప్రభుత్వ ఆదేశాలు అమలు చేసుకోవచ్చు. మీరు తిరిగి పదేపదే అవే ప్రశ్నలు అడిగితే నా సమాధానం కూడా అదే. మీకు కావాలంటే బ్రేక్ తీసుకోండి. కానీ అవే ప్రశ్నలు అడగడం వల్ల లాభం లేదు. ఊహాజనితంగా ప్రశ్నలు అడగడం వల్ల కేసు విచారణ ముందుకు పోదు.

కేటీఆర్‌పై ఝూటా కేసు: మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్ సర్కారు పెట్టింది ఝూటా కేసు అని మాజీ మంత్రి మహమూద్ అలీ విమర్శించారు. బీఆర్ఎస్ 14 ఏండ్ల పోరాట చరిత్రలో ఎన్నో అక్రమ కేసులను భరించిందని తెలిపారు. తెలంగాణభవన్‌లో గురువారం బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అక్రమ కేసులతో బీఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నదని విమర్శించారు. ఇలాంటి అక్రమ కేసులకు తాము భయపడబోమని తేల్చిచెప్పారు.

కేటీఆర్‌పై కక్ష సాధింపు: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలో భాగంగా తప్పుడు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్‌ను ఏడు గంటలు ప్రశ్నించిన ఏసీబీ.. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదని ఎద్దేవా చేశారు. ఏసీబీ కేసులో ఏమాత్రం పస లేదని వ్యాఖ్యానించారు.

కేసును చట్టబద్ధంగా ఎదుర్కొంటాం: మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసును చట్టబద్ధంగా ఎదుర్కొంటామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిని విస్మరించి అబద్ధాలు, కేసుల పునాదులపై పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన దురాగాతాలు ఎన్నోరోజులు నడవవని పేర్కొన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

బీర్ల అయిలయ్య నాలుక చీరేస్తాం: గెల్లు శ్రీనివాస్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే నాలుక చీరేస్తామని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. కేటీఆర్ గురించి బీర్లకు మాట్లాడే స్థాయి లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు అమలుచేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. అక్రమ అరెస్టులతో హామీల నుంచి తప్పించుకోలేరని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నేతల భరతం పడతామని హెచ్చరించారు.

హామీల అమలుచేతగాకే కక్షసాధింపు: రాకేశ్‌రెడ్డి



ఆరు గ్యారెంటీల అమలు చేతగాకనే కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కేటీఆర్‌ను అరెస్టు చేయాలని రేవంత్ చూస్తున్నాడని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ హామీలను అమలుచేయాలని నిలదీస్తున్నందుకే ఈ వేధింపులని మండిపడ్డారు. ఏడాదిపాటు శ్రమించి పసలేని కేసు పెట్టారని దుయ్యబట్టారు. కేటీఆర్ లాయర్‌తోపాటు హాజరవడానికి హైకోర్టు అనుమతి కాంగ్రెస్‌కు చెంపపెట్టులాంటిదని పేర్కొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసు: వాసుదేవరెడ్డి



ప్రశ్నించే గొంతులను నొక్కడం, అక్రమ కేసులు బనాయించడం, బెదిరించడం రేవంత్‌రెడ్డి రాజ్యంలో కామన్ అయిందని, అయినా ప్రభుత్వం తమ పోరాటం ఆపబోమని బీఆర్ఎస్ సీనియర్ నేత కేతిరెడ్డి వాసుదేవరెడ్డి హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పాలించడం చేతకాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసులు పెడుతున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా ప్రజల కోసం కొట్లాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు.

ఫార్ములా కంపెనీతో సీఎం చీకటి ఒప్పందం: తుంగ బాలు



కేటీఆర్ ఫార్ములా-ఈ తెచ్చి హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచితే, కాంగ్రెస్ సర్కారు డ్యామేజ్ చేయడమే పనిగా పెట్టుకున్నదని బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు తుంగ బాలు దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్ములా-ఈ కంపెనీ ప్రతినిధులతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ఆయన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్‌పై కేసులు పెడుతూ బద్నాం చేస్తున్నారని దుయ్యబట్టారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ బీర్ల అయిలయ్య పదేండ్లు నిజాయతీ, నిబద్ధతతో మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌పై అడ్డదిడ్డంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

ఏడో గ్యారెంటీగా నిర్బంధాలు: దేవీప్రసాద్

ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయడం చేతగాని కాంగ్రెస్ సర్కారు ఏడో గ్యారెంటీగా నిర్బంధాలను మాత్రం అమలు చేస్తున్నదని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ అసమాన పోరాటం చేశారని, ఈ చెత్త కేసులో వెనుకడుగు వేయబోరని పేర్కొన్నారు.

రేవంత్‌వి తప్పుడు కేసులు : ఆగయ్య

హైదరాబాద్‌కు ఫార్ములా-ఈ తెచ్చి రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయస్థాయికి పెంచిన కేటీఆర్‌పై ముఖ్యమంత్రి తప్పుడు కేసులు మోపుతున్నారని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అటకెక్కించి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా ఏ తప్పు చేయని కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రాథమిక విచారణ చేయకుండా అక్రమ కేసు : ఉపేంద్ర



ప్రశ్నించే గొంతులను అణిచివేయడంలో భాగంగానే కేటీఆర్‌పై రేవంత్ సర్కారు తప్పుడు కేసు పెట్టిందని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ మాజీ చైర్మన్ ఉపేంద్ర విమర్శించారు. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచడానికే ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహించారని, ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని స్పష్టంచేశారు. ప్రాథమిక విచారణ చేయకుండా ఏడాది తర్వాత కేటీఆర్‌ను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశంతోనే అక్రమ కేసు బనాయించారని విమర్శించారు.

కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తరు: విజయ్



రేవంత్ ప్రభుత్వం.. ఏసీబీని కాస్తా అనుముల కాన్సపరసీ బ్యూరోగా మార్చుకున్నదని బీఆర్ఎస్ నేత కురువ విజయ్‌కుమార్ ఆరోపించారు. ఫార్ములా ఈ-రేసు కేసులో ఎలాంటి అవినీతి జరగలేదని, కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకొస్తారని ధీమా వ్యక్తంచేశారు. 50 లక్షలతో ఏసీబీకి అడ్డంగా దొరికి జైలుకెళ్లిన రేవంత్ అందరూ ఆయనలాగే అవినీతి చేస్తారని అనుకుంటున్నారా?అని నిలదీశారు.

ఉద్యమకారులకు జైళ్లు కొత్తకాదు: గజ్జెల నగేశ్



తాము తెలంగాణ ఉద్యమకారులమని, తమకు జైళ్లు కొత్తకాదని బీఆర్ఎస్ సీనియర్ నేత గజ్జెల నగేశ్ పేర్కొన్నారు. రేవంత్ పాలన గాలికి వదిలి నిర్బంధా లు కొనసాగిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలపై ఎన్ని కేసులు పెట్టినా హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

లక్షల మంది కేటీఆర్‌లు పుట్టుకొస్తరు: రజితారెడ్డి



తాము తెలంగాణ ఉద్యమకారులమని, కేసులకు భయపడబోమని, ఒక్క కేటీఆర్‌ను జైలుకు పంపిస్తే.. లక్షల మంది కేటీఆర్‌లు పుట్టుకొస్తారని బీఆర్ఎస్ అ ధికార ప్రతినిధి రజితారెడ్డి హెచ్చరించా రు. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతు న్న గొంతులను అణగదొక్కాలని రేవం త్ సర్కార్ చూస్తున్నదన్నారు.

హామీల అమలు డైవర్షన్ కోసమే: గోవర్ధన్‌రెడ్డి



పరిపాలన చేతగాక, ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక తన ఫెయిల్యూర్‌ను డైవర్ట్ చేసేందుకే రేవంత్‌రెడ్డి ఫార్ములా రేసు కేసును తెరపైకి తెచ్చారని బీఆర్ఎస్ సీనియర్ నేత, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. రేవంత్ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కేటీఆర్, బీఆర్ఎస్ సైనికులం భయపడబోమని స్పష్టంచేశారు.

కేటీఆర్‌ను బద్నాం చేసేందుకే కేసు : భరత్‌రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేక డైవర్షన్ డ్రామాలు మొదలుపెట్టిందని బీఆర్ఎస్ నేత ఏనుగు భరత్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజాసమస్యలపై నిత్యం నిలదీస్తున్న కేటీఆర్‌ను బద్నాం చేసేందుకే ఫార్ములా-ఈ కేసును తెరపైకి తెచ్చిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకో అబద్ధంతో పాలన సాగిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.